క్లుప్తంగా

హైందవ శంఖారావానికి మద్దతుగా బైక్ ర్యాలీ



దెందులూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రామదండు సభ్యులు

దెందులూరు: హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు మద్దతుగా దెందులూరు రామదండు ఆధ్వర్యంలో దెందులూరులో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. దెందులూరులోని శివాలయం వద్ద నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ గ్రామంలోని ఎన్టీఆర్ బొమ్మ సెంటర్, ఇంద్రవనం, 9వ వార్డు, రామాలయం మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. హైందవ శంఖారావానికి మద్దతు తెలుపుతూ స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి పేర్లు నమోదు చేయించుకున్నారు.


పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు



కైకరం హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు అదనపు తరగతి నిర్వహణ

ఉంగుటూరు: కైకరం హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించేందుకు వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేశారు. ఈమేరకు అదనపు తరగతులను నిర్వహించడం ప్రారంభించామని హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. ప్రధానంగా గణితం, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించి వెనుకబడి ఉన్న విద్యార్థులను చైతన్యపరచనున్నట్టు హెచ్ఎం తెలిపారు.

అపుస్మా జోన్ -11 చైర్మన్‌గా గుణ్ణం బుల్లియ్య



గుణ్ణం బుల్లబ్బాయి

ఉంగుటూరు: ప్రైవేటు కాన్వెంట్ల అసోషియేషన్ (అపుస్మా) జోన్ -11 చైర్మన్‌గా నారాయణపురానికి చెందిన గుణ్ణం బుల్లబ్బాయి (బుల్లియ్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో ఈ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని ప్రైవేటు స్కూళ్లు జోన్ -11 కిందికి వస్తాయి. గతంలో ఈ అసోసియేషన్‌లో బులబ్బాయి పలు పదవులు నిర్వహించారు. బుల్లఅబ్బాయి ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మానవత సేవలు విస్తృతం



మానవత వ్యవస్థాపకుడు రామచంద్రరెడ్డిని కలిసిన సంస్థ ప్రతినిధులు

ఉంగుటూరు: మానవత సంస్థ వ్యవస్థాపకుడు ఎన్ రామచంద్రరెడ్డిని ఉంగుటూరు మండల మానవత సంస్థ ప్రతినిధులు ఆదివారం కలిశారు. నల్లజర్లలో నిర్వహించిన జిల్లా మానవత కార్యవర్గ సమావేశానికి రామచంద్రరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశానికి రామచంద్రరెడ్డిని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల ఉపాధ్యక్షుడు కోనే వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శి గంజి రవి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత సేవలు విస్తృతం చేసేందుకు సంస్థ సభ్యులందరూ కృషి చేస్తామన్నారు.

ఎరువుల కొరతను నివారించాలి

ఏలూరు (టూటౌన్): రబీ సాగు చేస్తున్న రైతులకు ఎరువులు లభించక ఇబ్బందులు పడుతున్నారని, ఎరువుల కొరత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. ఏలూరు, అన్నే భవనంలో ఆదివారం ఆయన ఎరువుల కొరతపై మాట్లాడారు. డీఏపీ, యూరియా, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో లేవన్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్దనే కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ఎరువులు కొరత ఉందని సాకు చూపి అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. కొంత మంది వ్యాపారులు అధిక ధరలకు ఎరువులు విక్రయించడంతో రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

సైన్స్ సంబరానికి వేళాయె

- నేడు మండల స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన పోటీలు ప్రారంభం
- మూడు కేటగిరీల్లో ప్రాజెక్టుల ప్రదర్శన
- ప్రైవేటు విద్యార్థులూ ఈ పోటీలకు అర్హులు
- తొలిసారి టీచర్ తయారు చేసిన ప్రాజెక్టు ప్రదర్శించేందుకు అవకాశం



జల్లికొమ్మర యూపీ స్కూల్లో పాఠశాల స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన



వర్కింగ్ మోడల్ ప్రదర్శిస్తున్న పత్తేపురం జెడ్పీ స్కూల్ విద్యార్థులు

నిడమర్రు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ ఉత్తమ ప్రదర్శనలు ఎంపిక చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులే కాకుండా టీచర్ రూపొందించిన ఎగ్జిబిట్‌తో వ్యక్తిగతంగా పోటీలో పాల్గొనే అవకాశం అధికారులు కల్పించారు. ఇలా ఆయా స్థాయిలో విద్యార్థుల ప్రదర్శించిన ఉత్తమ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు(ఎస్ఐఎస్ఎఫ్)–2025 ఎంపిక చేయనున్నారు. దీనిలో భాగంగా నియోజకర్గంలోని నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాలకు సంబంధించి 30వ తేదీన మండల స్థాయిలో, గణపవరం మండ లంలో జనవరి 2న మండలస్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు ఆయా మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికై న ప్రదర్శనలను జనవరి 3,4 తేదీల్లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నారు. ఈ పోటీలు విశ్వేశ్వర య్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం (వీఐటీఎమ్) బెంగుళూరు వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మూడు కేటగిరీల్లో

పాఠశాల నుంచి జిల్లాస్థాయి వరకూ మూడు కేటగిరిల్లో ఎగ్జిబిట్స్‌ను ఎంపిక చేయనున్నారు. ఉప అంశాలుగా భౌతిక, రసాయన శాస్త్రం, గణితం, భూమి అంతరిక్ష శాస్త్రం, పర్యావరణ శాస్త్రం, ఇంజనీరింగ్, జీవరసాయన శాస్త్రం, కంప్యూటర్ విద్యపై మూడు కేటగిరీల్లో ప్రదర్శనలు రూపొందించాల్సి ఉంటుంది.

- **ఉపాధ్యాయుల ప్రదర్శన :** కేవలం ఒక ఉపాధ్యాయుడు మాత్రమే తయారు చేసిన మోడల్‌ను ప్రదర్శించే అవకాశం తొలిసారి కల్పించారు.
- **విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శన:** ఒక విద్యార్థి, ఒక టీచర్ సహకారంతో మోడల్ ప్రదర్శించవచ్చు.
- **విద్యార్థుల గ్రూప్ ప్రదర్శన (గ్రూప్ ఎగ్జిబిట్):** ఇద్దరు విద్యార్థులు, ఒక టీచర్ సహకారంతో ప్రదర్శించవచ్చు.

మండలం	ప్రభుత్వ/ప్రైవేటు విద్యాసంస్థలు	6-10వ తరగతులు విద్యార్థులు
గణపవరం	74	3,780
భీమడోలు	63	3,500
ఉంగుటూరు	83	4,083
నిడమర్రు	51	2,064

ప్రైవేటు విద్యార్థులూ ఈ పోటీలకు అర్హులే

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ ప్రాజెక్టుల ప్రదర్శనలో పాల్గొనవచ్చు. మండల స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రదర్శించే మోడల్ నేరుగా జిల్లాస్థాయికి ఎంపిక అవుతుంది. ఈ పోటీల్లో పాల్గొనే వారు శాస్త్రీయ దృక్పథం, సామాజికంగా ప్రయోజనకారంగా, ప్రాజెక్టలను తీర్చిదిద్దుకోవాలి. కనీస ప్రమాణాలు కలిగి, ప్రాజెక్టులు నాణ్యమైనవిగా ఉండేలా తయారు చేయాలని ఇప్పటికే ఉపాధ్యాయులకు అధికారులు అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ తయారీలో థర్మాకోల్‌ను ఎట్టిపరిస్థితిల్లోనూ వినియోగించరాదని అధికారులు స్పష్టం చేసారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాలలు నుంచి తప్పనిసరిగా ఈ సైన్స్ ప్రదర్శనలో పాల్గొనాలని సూచనలు జారీ చేసారు.

పిప్పర జెడ్పీ పాఠశాలలో మండల స్థాయి పోటీలు



గణపవరం మండలం పిప్పర జెడ్పీ స్కూల్లో జనవరి 2న మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నాం. 3 కేటగిరిలో ఎంపికైన ఒక్కో ప్రదర్శనను జిల్లాస్థాయిలో జనవరి 4న వీరవాసరం జెడ్పీ స్కూల్లో నిర్వహించే పోటీలకు పంపిస్తాం. సమాజ సమస్యల పరిష్కారంగా, ఆలోచింపచేసే విధంగా ఉండే వర్కింగ్ మోడల్ ప్రాజెక్టలకు ప్రాధాన్యత ఇవ్వనున్నాం.

– గొర్రెల బాలయ్య, ఎంఈవో–2, గణపవరం

థర్మాకోల్‌తో తయారుచేసే ప్రాజెక్టలకు అనుమతి లేదు



థర్మాకోల్ షీట్స్‌ను వినియోగించి తయారు చేసే ప్రాజెక్టలను అనుమతించము. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు విద్యాసంస్థల టీచర్లు, విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్స్‌తో పోటీలో పాల్గొనవచ్చు. మండల స్థాయి పోటీలు సోమవారం నిడమర్రు జెడ్పీ స్కూల్లో నిర్వహిస్తున్నాం. నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఉంటుంది.

– ఏవీఎస్ఎన్ భాస్కర్‌కుమార్, ఎంఈవో–2, నిడమర్రు

మూలకు చేరిన కియోస్క్ యంత్రాలు



ఆర్‌బీకేలోని గోనె సంచుల పక్కనే ఉన్న కియోస్క్ యంత్రం

భీమడోలు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతన్నకు ఆసరాగా ఉన్న కియోస్క్ యంత్రాలు మూలన పడేసారు. వేలాది రూపాయల విలువ గల ఈ యంత్రాలు నిరుపయోగకరంగా ఉన్న గోనె సంచులు పక్కనే పెట్టి చేతులు దులిపేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలను రైతులకు ఏ విధంగా ఉపయోగపడకుండా నిర్లక్ష్యం చేస్తోంది. దీనితో వ్యవసాయ శాఖ సిబ్బంది సైతం వాటిని పక్కనే పడేసారు. భీమడోలులోని–1 రైతు భరోసా కేంద్రంలోని కియోస్క్ యంత్రం దుమ్ము, ధూళి గల గోనె సంచుల పక్కనే ఉంది. దీనితో రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో ఈ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువులు పంపిణీ చేసేవారు. తక్షణమే రైతులు ఎరువులను ఎంఆర్‌పీకే అందుకునేవారు. ప్రస్తుతం యంత్రాలు వినియోగించకపోవడంతో రైతులు ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. కియోస్క్ యంత్రాలపై ఎటువంటి ధూళి పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత అధికారులు తెలిపారు.

కుల ప్రాతిపదికన జాబితాలు సిద్ధం

భీమడోలు: ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో కుల ప్రాతిపదిక జాబితాలు సిద్ధంగా ఉన్నాయని, వాటిని పరిశీలించుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మాముడూరి ఏలియా అన్నారు. భీమడోలులో ఆదివారం నిర్వహించిన సమావేశానికి జిల్లా నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏలియా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో కుల ప్రాతిపదికన జాబితాలను ప్రదర్శించినట్టు తెలిపారు. మాదిగ సోదరులు సచివాలయాలను సందర్శించి కుల ప్రాతిపదికన ధ్రువీకరణ పత్రాలను పొందాలన్నారు. కుల పరంగా తప్పులున్నట్లయితే డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోల దృష్టికి తీసుకుని వెళ్లి సరి చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కాటూరి జోగేశ్వరరావు, జూలపల్లి రవి, ఉండి నాగరాజు, చింటు, అనిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఉపాధి భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): హమాలీలకు ఉపాధి భద్రతతో కూడిన చట్టం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు (యూవీ) కోరారు. ఏలూరు మార్కెట్ యార్డు ఆవరణలో ఇఫ్టూ అనుబంధ జట్టు కార్మిక సంఘం యూనియన్ ప్రెసిడెంట్ జగ్గరపు రమణ అధ్యక్షతన ఆదివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాట్లాడుతూ దేశంలో మోదీ సర్కార్ తీసుకొచ్చిన నాలుగు చట్టాలు కార్మిక హక్కులు హరించే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాతలను హేళన చేసే అమిత్ షా విధానాలకు వ్యతిరేకంగా కార్మిక ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలియజేశారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు పలు అంశాలపై మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ రంగాలను ప్రైవేటు దిశగా మోదీ సర్కార్ ప్రయత్నం చేస్తోందని, రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేసే పద్ధతిలో వ్యవహరిస్తోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సభలో ఐఎఫ్‌టీయూ నగర నాయకులు ఘడసాల రాంబాబు, ముంగం అప్పారావు, సందకం అప్పారావు, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, అన్నవరం పాల్గొన్నారు.

కొవ్వలిలో ముగ్గురు జూదరుల అరెస్ట్

దెందులూరు: కొవ్వలిలో ఆదివారం పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.53,000 స్వాధీనం చేసుకున్నామని, మండలంలో ఏ గ్రామంలోనైనా కోడిపందేలు, జూదాలు నిర్వహించిన, సహకరించిన వారిపై నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్‌లో నమోదు చేస్తామన్నారు. పాత నేరస్తులు అందరిపై నిఘా ఉంచామన్నారు.

జోరందుకున్న మొక్కజొన్న నాట్లు



పెదవేగిలో మొక్కజొన్న నాట్లు వేస్తున్న మహిళలు

పెదవేగి : మండలం పరిధిలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న నాట్లు ఊపందుకున్నాయని వ్యవసాయశాఖాధికారి ఎం. ప్రియాంక ఆదివారం తెలిపారు. పెదవేగి మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం నాటికి 11 వందల హెక్టార్లలో నాట్లు వేశారని ఆమె తెలిపారు. గతేడాది 2వేల హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు మొక్కజొన్న సాగు చేశారని, ఇంకా మరికొన్ని చోట్ల నాట్లు వేస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం ఖరీఫ్ ఆశాజనకంగా లేనందున రెండవ పంటపై ఆశలు పెట్టుకుని రైతులు మొక్కజొన్న నాట్లు వేస్తున్నారని ఏవో చెప్పారు.

అలరించిన త్యాగరాజ సంకీర్తనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యా ర్చన నిర్వహించారు. ఉదయం స్వామి వారి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన గాయనీమణులు వేదుల జయలక్ష్మి, గుడిపాటి వెంకటరత్న శిరీష ఆలపించిన త్యాగరాజ భక్తి సంకీర్తనలు అలరించాయి.

రవికుమార్‌కు పర్యావరణ కవి పురస్కారం



తెలుగు ఉపాధ్యాయుడు చొదిమెళ్ల రవికుమార్‌కు పురస్కారం అందించి సత్కరిస్తున్న దృశ్యం

పెదవేగి : ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచిన చొదిమెళ్ల రవికుమార్‌కు ఘన సత్కారం లభించింది. పెదవేగి మండలం భోగాపురంలోని విజ్ఞాన్ వరల్డ్ ఒన్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు చొదిమెళ్ల రవికుమార్ ఈనెల 28,29 తేదీల్లో విజయవాడ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో 6 ప్రపంచ తెలుగు రచయితల మహాసభల సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అంశంపై నిర్వహించిన యువగళ సమ్మేళనంలో పాల్గొని, ఓ మానవ.. మానవ ×అనే శీర్షికతో కవితా పఠనం చేసి అందరి అభినందనాలు పొందారు. మహాసభల నిర్వాహకులు రవికుమార్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను, పర్యావరణ కవి పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఉపాధ్యాయుడు రవికుమార్ సాహిత్య అభ్యున్నతిని కొనియాడుతూ ఉపాధ్యాయులు, మిత్రులు, బంధువులు అభినందించారు.

పండుగల వేళ.. ధరల మోత

- మండుతున్న వంట నూనెల ధరలు
- పప్పులు, కూరగాయలదీ అదే దారి
- ధరల మోతతో అల్లాడుతున్న సామాన్యులు
- ఆచితూచి కొనుగోలు చేస్తున్న ప్రజలు
- ధరల నియంత్రణకు చర్యలు చేపట్టని ప్రభుత్వాలు



నిత్యావసర సరుకులు

ఏలూరు (టూటౌన్): పండుగ వేళ నిత్యావసర సరుకుల ధరల మోత మోగుతుండటంతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు. పప్పులు, కూరగాయలు, వంట నూనెలు, పండ్లు అన్నీ సామాన్యులకు అందనంతగా ధరలు పెరిగాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలనిత్యావసరాలను కొనుగోలు చేయలేక హడలిపోతున్నారు.

పెరిగిన ధరలతో అల్లాడుతున్న ప్రజలు

కూరగాయలు, పండ్లు కొనుగోలు చేయడానికి జనం వెనకడుగు వేయాల్సి వస్తోంది. ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు ఆచితూచి నిత్యావసర సరుకులు, పండ్లు కొనుగోలు చేస్తున్నారు. పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవడంతో జనం అవస్థలు పడుతున్నారు. న్యూ ఇయర్, సంక్రాంతి పండుగలు ఎదురుగా ఉన్నాయి. సంక్రాంతికి ప్రతి ఇంటిలోనూ సందడి నెలకొననుంది. దీంతో ఖర్చు తడిసి మోపెడుకానుంది. దానికి తోడు పెరిగిన నిత్యావసరాల ధరల కారణంగా ప్రతి కుటుంబంపై అదనంగా రూ.5 వేల నుంచి రూ.10వేలు అదనపు భారం పడుతుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

సామాన్య, పేద వర్గాలు పౌష్టికాహారానికి దూరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టకపోవడంపై ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు నియోజకవర్గంలో దాదాపు 3.70 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. సుమారు లక్షకు పైగా కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 90 శాతం కుటుంబాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే.. వీరి సగటు ఆదాయం నెలకు రూ.10 వేల నుంచి రూ.15వేలలోపే ఉండటం గమనార్హం. గతంలో ఒక కుటుంబానికి నిత్యావసరాలు, కూరగాయలు, పాలకు కలిపి రూ.10వేల వరకూ ఖర్చు అయ్యేది. ఇదే క్రమంలో పెరిగిన నిత్యావసర ధరల కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల ఖర్చు విపరీతంగా పెరిగి పోయింది. దీంతో సామాన్యులు తమ ఆదాయ వనరుల ప్రకారం ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు, పేదలు పౌష్టికాహారానికి దూరం కావాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి

దిగిరాని ఉల్లి ధరలు

రోజు రోజుకూ పెరిగిపోతున్న నిత్యావసరాలు, కూరగాయలు ధరలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల నడ్డివిరుస్తున్నాయి. మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. నెలరోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ.40 వరకు పలుకుతోంది. ఉల్లిపాయలు సైతం కిలో రూ.40 నుంచి రూ.50 ధర ఉంది. కొన్ని నెలలుగా ధరలు అదుపులోకి రాకుండా ఇబ్బడి ముబ్బడిగా పెరిగి పోతున్నా వీటిని అదుపు చేసేందుకు చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నిత్యావసరాలకు రెక్కలు

కంది, మినప, పెసర, శనగ వంటి పప్పు దినుసులు కిలో రూ.120 నుంచి రూ.170 పైకి చేరింది. మార్కెట్‌లో కంది పప్పు సాధారణంగా నాణ్యత ఆధారంగా కిలో రూ.150 నుంచి రూ.170 వరకూ ఉంది. మినుములు కిలో రూ.120 నుంచి రూ.165 వరకూ విక్రయిస్తున్నారు. పొట్టు తీసిన మినపగుళ్లు నాణ్యమైనవి రూ.200 వరకు, పెసర పప్పు కిలో రూ.110 నుంచి రూ.130 వరకూ విక్రయిస్తున్నారు. శనగ పప్పు ధర కిలో రూ.90 పైనే పలుకుతోంది. ఇక వేరుశనగ కిలో రూ.110 నుంచి రూ.130 వరకూ, వెల్లుల్లి కిలో రూ.300 వరకూ విక్రయిస్తున్నారు.

సలసల కాగుతున్న వంట నూనెలు

పండుగ వేళ వంట నూనెల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో ప్రజలు అల్లాడుతున్నారు. రిఫైండ్ ఆయిల్ ప్యాకెట్ లీటరు రూ.140 నుంచి రూ.150 పలుకుతోంది. పిండి వంటలకు అధికంగా వినియోగించే పామాయిల్ లీటర్ ప్యాకెట్ ధర రూ.127 నుంచి రూ.135 పలుకుతోంది. గతేడాది సంక్రాంతి పండుగకు రిఫైండ్ ఆయిల్ లీటర్ ప్యాకెట్ ధర రూ.115 నుంచి రూ.118 ఉండేది. అదేవిధంగా పామాయిల్ ధరల లీటర్ ప్యాకెట్ రూ.105 నుంచి రూ.110 వరకు ఉండేది. దానికి భిన్నంగా ఈ ఏడాది సంక్రాంతికి వంట నూనె ధరలకు రెక్కలు రావడంతో వినియోగదారులు తల్లడిల్లుతున్నారు.

ధరలను అరికట్టడంలో ప్రభుత్వాల వైఫల్యం

రోజు రోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలి. ఒక పక్క పండుగల సీజన్ కావడం, దానికి తగ్గట్టుగా ధరాఘాతంతో సామాన్య ప్రజలు నిత్యావసరాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకుడు

నెలకు అదనంగా రూ.5 వేలు ఖర్చు

నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో నెలకు అదనంగా రూ.5వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెరిగిన ధరల కారణంగా ఖర్చు రెట్టింపు కావడంతో కూరగాయలను తక్కువగా కొనుగోలు చేస్తున్నాం. పప్పులు కొనుగోలు చేయడానికి భయపడే పరిస్థితి నెలకొంది.

– వెంపా విజయలక్ష్మి, గృహిణి, పాలగూడెం, ఏలూరు రూరల్ మండలం

కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

- కోడిపందేల నిర్వహణకు గ్రామాల్లో సన్నాహాలు
- బరుల కోసం మారుమూల ప్రాంతాల అన్వేషణ
- అడ్డుకుంటామంటున్న పోలీసులు



తలపడుతున్న పందెం కోళ్లు



పొలాల్లో ప్రత్యేక పోషణతో పెరుగుతున్న పందెం కోళ్లు

పెదవేగి : సంక్రాంతి సంబరాలకు కొంచెం ముందుగానే కోడిపుంజులు పందేలకు సిద్ధమయ్యాయి. సంక్రాంతి వేడుకల్లో గ్రామీణులు కోడి పందేలకు అధిక ప్రాధాన్యతనిస్తారు. కాళ్లకు పదునెక్కిన కత్తులు కట్టిన పందెంకోళ్లు బరిలో తలపడుతుంటే పిల్లా, పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందిస్తారు. అంతే కాకుండా పందేలు కాస్తారు. సంక్రాంతి వేడుకల్లో కోడిపందేలకు పూర్వం నుంచి ప్రాధాన్యం ఉండడంతో రాజకీయ ఒత్తిడికి పోలీసులు కూడా ప్రేక్షక పాత్ర వహించక తప్పడంలేదు. నేడు కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి కొనసాగుతుందా, లేదనే విషయంపై గ్రామ నాయకులు, పందేల నిర్వాహకులు చర్చించుకుంటున్నారు. అనుమతులు వచ్చిన వెంటనే పందేలు నిర్వహించేందుకు కోళ్లను సిద్ధం చేసే పనిలో నిర్వాహకులు ఇప్పటికే నిమగ్నమయ్యారు. ఏటా కోడిపందేల ద్వారా కోట్ల రూపాయలు చేతులు మారేవి. ఈ ఏడాది కూడా భారీగా పందేలు వేయడానికి వివిధ గ్రామాల వారు సిద్ధమవుతున్నారు.

బరులను సిద్ధం చేసే పనిలో బడాబాబులు

నియోజకవర్గంలో కొప్పాక, బి శింగవరం, బాపిరాజుగూడెం, రాయన్నపాలెం, వేగివాడ, రామశింగవరం, కొప్పాకగూడెం, జానంపేట విజయగార్డెన్స్, పినకడిమి, భోగాపురం, కొప్పులవారిగూడెం, రామారావుగూడెం, చల్లచింతలపూడి, దెందులూరు, జోగన్నపాలెం, పెదపాడు, వసంతవాడ, వట్లూరు తదితర గ్రామాల్లో గతేడాది సంక్రాంతి సందర్భంగా భారీ ఎత్తున కోడిపందేలు నిర్వహించారు. ఈ ఏడాది పందేలు కొత్తగా ఏ గ్రామాల్లో నిర్వహిస్తే బావుంటుందోనని బరుల నిర్వాహకులు సర్వే నిర్వహిస్తున్నారు. బరుల నిర్వహణకు అనువైన వేదికలను వారు అన్వేషిస్తున్నారు. ఈ ఏడాది కూడా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తారా లేక పందేలు జరగకుండా అడ్డుకుంటారా అనేది వేచి చూడాల్సిందే. ప్రస్తుతం పందెం కోడిపుంజు ధర రూ. 5 వేల నుంచి రూ.25వేల వరకు విక్రయిస్తున్నారు. సైజు, రకాన్ని బట్టి కొన్ని పుంజుల రేటు రూ.40 వేల వరకు కూడా పలుకుతోంది. పందెం కోళ్లను రైతులు పొలాల్లో, వివిధ రకాల రహస్య ప్రదేశాల్లో వాటికి బలమైన ఆహారం పెడుతూ సంక్రాంతి పందేలకు సిద్ధం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పందేలు జరగనివ్వం



నిబంధనలకు విరుద్ధంగా కోడి పందేలు నిర్వహిస్తే అడ్డుకుంటాం. దీనిపై సంక్రాంతి కొద్ది రోజుల ముందు నుంచే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమానాస్పద వ్యక్తులను ముందస్తు చర్యగా బైండోవర్ చేసాం. ఎటువంటి ప్రతికూల పరిస్థితులకు తావివ్వకుండా పండుగను ప్రజలందరూ ఆనందంగా, జరుపుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కె. రామకృష్ణ, ఎస్సై, పెదవేగి